సాక్షి కామారెడ్డి

శనివారం : 22 : మార్చి : 2025



ఇబ్బందులు రాకుండా చూడాలి

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ శని : 6:33

సహర్ ఆది : 4:56

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.8 /21.5

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'మహిళలు చట్టాలపై అవగాహన కలిగిఉండాలి'



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి నాగరాణి

కామారెడ్డి టౌన్ : మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి.నాగరాణి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇంస్లాపురా కాలనీలో కేఆర్‌కే సన్‌షైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపవద్దన్నారు. మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ (15100)కు కాల్ చేయాలని సూచించారు. చిన్నపాటి సమస్యలుంటే కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషాలిటీ వైద్య సేవలు

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలోగల ప్రభుత్వ ఆస్పత్రులలో స్పెషలిస్టు వైద్యుల సేవలు అందుబాటులో ఉన్నాయని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. జిల్లా ఆస్పత్రితో పాటు బాన్సువాడ, దోమకొండ, మద్నూర్, ఎల్లారెడ్డి ఏరియా ఆస్పత్రులలో గైనకాలజిస్ట్, అనస్తీషియాలజిస్ట్, ఆర్థోపెడిక్, రేడియాలాజిస్ట్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

'మక్కిన తర్వాతే పంట కోయాలి'



ధాన్యం గింజల కొలతలపై అవగాహన కల్పిస్తున్న డీఏవో తిరుమల ప్రసాద్

బాన్సువాడ : ధాన్యం గింజలు మక్కిన తర్వాతనే పంటను కోయాలని డీఏవో తిరుమల ప్రసాద్ సూచించారు. శుక్రవారం బాన్సువాడ వ్యవసాయ శాఖ కార్యాలయంలో వరి కోత యంత్రాల యజమానులు, ఏజెంట్లు, డ్రైవర్లకు వరి కోతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అందించే బోనస్‌కు ఏ రకం ధాన్యం వర్తిస్తుందో వివరించారు. యంత్రం ద్వారా ధాన్యం గింజల పొడవు, వెడల్పుల కొలతలు తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ విజేందర్, సివిల్ సప్లయ్ అధికారి మల్లికార్జున్‌బాబు, జిల్లా వ్యవసాయ సంచాలకులు అరుణ, బాన్సువాడ ఏడీఏ లక్ష్మీప్రసన్న, సహకార సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

24న కాంగ్రెస్ పార్టీ సమావేశం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 24వ తేది మధ్యాహ్నం 3 గంటలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యేలు పోచారం, మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు హాజరయ్యే సమావేశాన్ని పార్టీ నేతలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, రాజాగౌడ్, శ్రీనివాస్ యాదవ్, అశోక్ రెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌రావు, కన్నయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



జనతా కర్ఫ్యూ రోజున నిర్మానుష్యంగా మారిన జిల్లాకేంద్రంలోని రైల్వే బ్రిడ్జి ప్రాంతం (ఫైల్)

వణికించే జ్ఞాపకం!

జీవితాలను అతలాకుతలం చేసిన కరోనా

- జిల్లాలో 341 మంది మృత్యువాత
- వేలాది మంది ఆస్పత్రులపాలు
- వైద్యం కోసం రూ. లక్షలు ఖర్చు
- ఇప్పటికీ కోలుకోని కుటుంబాలెన్నో..
- జనతా కర్ఫ్యూకు ఐదేళ్లు

కరోనా వైరస్ ఎన్నో జీవితాలను బలి తీసుకుంది. ఇంకెన్నో కుటుంబాలను కోలుకోలేని విధంగా చేసింది. జిల్లాలో వేలాది మంది కోవిడ్‌తో ఆస్పత్రుల పాలయ్యారు. కొందరు మృత్యువుతో పోరాడి తనువు చాలించారు. కరోనాను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం జనతా కర్ఫ్యూ విధించి శనివారంతో ఐదేళ్లవుతోంది. ఈ సందర్భంగా జిల్లాలో ఆనాటి పరిస్థితులపై కథనం..



లారీలో తరలివెళ్తున్న వలసకూలీలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కరోనా వైరస్ అన్ని దేశాలను వణికించింది. మన దేశంలోనూ వైరస్ ప్రభావం కనిపించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టడికి అనేక చర్యలు తీసుకున్నాయి. మొదటగా 2020 మార్చి 22న దేశ వ్యాప్తంగా జనతా కర్ఫ్యూ విధించారు. ఏ ఒక్కరూ గడప దాటొద్దని పిలుపునివ్వగా అందరూ ఇళ్లకే పరిమితమయ్యారు. కోవిడ్‌ను అదుపు చేయడానికి ప్రభుత్వం మరుసటి రోజు నుంచే లాక్‌డౌన్ విధించింది. ఎన్నడూ ఊహించని రీతిలో అందరూ ఇళ్లకే పరిమితమయ్యారు. నెలల తరబడిగా లాక్‌డౌన్ కొనసాగడంతో జనజీవనం ఆగమైంది. తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితులు ఏర్పడ్డాయి. కోవిడ్ బారిన పడి వేలాది మంది ఆస్పత్రుల పాలయ్యారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఒక ఇంట్లో ఒకరికి కరోనా సోకిందంటే చాలు కుటుంబసభ్యులందరూ వైరస్ బారిన పడ్డారు. కొన్ని కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 14,093 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా.. 341 మంది మృత్యువాత పడ్డారు. అయితే ప్రైవేటు ఆస్పత్రులు, ఇంటి వద్ద చికిత్సలు పొందిన వారు, మృతిచెందినవారు అంతకన్నా రెట్టింపు సంఖ్యలో ఉంటారు.

ఒక్కరితో మొదలై..

2020 మార్చి 27న కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లికి చెందిన ఓ వృద్ధుడు హైదరాబాద్ ఆస్పత్రిలో చేరగా.. అతడికి కోవిడ్ నిర్ధారణ అయ్యింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులందరినీ హోం క్వారంటైన్ చేశారు. చుట్టుపక్కల రోడ్లన్నింటినీ మూసివేసి కట్టడి చేశారు. ఆ ప్రాంతాన్ని సానిటైజ్ చేశారు. ఇరుగుపొరుగు నివసించే వారందరికీ పరీక్షలు చేశారు. అదే సమయంలో ఢిల్లీకి వెళ్లొచ్చిన బాన్సువాడ, కామారెడ్డి, పిట్లం ప్రాంతాలకు చెందిన పలువురికి కరోనా నిర్ధారణ అయ్యింది. వారి ద్వారా వారి కుటుంబ సభ్యులకు కరోనా వ్యాపించింది. కోవిడ్ కట్టడికి జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. వైద్యులు, వైద్య సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి బాధితులకు సేవలందించారు. అయినా ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో కరోనా వ్యాప్తి వేగంగా జరిగింది. కాగా కోవిడ్‌తో ఆస్పత్రుల పాలై చికిత్సలు పొంది కోలుకున్న వారిలో చాలామంది ఇప్పటికీ ఏదో ఒక రకమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

బంధాలను తెంచేసిన వైరస్

కరోనా సమయంలో ఎవరికి ఎవరూ కాకుండాపోయారు. వైరస్ బారిన పడి ఆస్పత్రిలో ఉన్న వారి వద్దకు కుటుంబ సభ్యులు కూడా వెళ్లి పరామర్శించే సాహసం చేయలేకపోయారు. కోవిడ్‌తో చనిపోయిన వారి అంత్యక్రియలకు కూడా హాజరుకాలేని పరిస్థితులు ఎదురయ్యాయి. మున్సిపల్, పంచాయతీ కార్మికులు ట్రాక్టర్లలో శవాలను తీసుకువెళ్లి, పొక్లెయిన్‌లతో గుంతలు తవ్వించి ఖననం చేయాల్సి వచ్చింది. హైదరాబాద్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతూ చనిపోయిన వారి మృతదేహాలను అక్కడే దహనం చేయించారు. చివరి చూపునకూ కుటుంబ సభ్యులు నోచుకోలేకపోయారు. కొందరు మాత్రమే ధైర్యం చేసి రక్షణ చర్యలు తీసుకుని దూరం నుంచి ఆఖరు చూపు చూశారు. కరోనా కాలంలో సాధారణ మరణం సంభవించినా సరే కనీసం శవాన్ని మోయడానికి రక్త సంబంధీకులు కూడా రాలేదు.

అనాథలైన పిల్లలెందరో..

జిల్లాలో కరోనా మహమ్మారి చాలా కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసింది. కొన్ని కుటుంబాల్లో భార్య, భర్త ఇద్దరూ కరోనాతో చనిపోయారు. దీంతో వారి పిల్లలు అనాథలయ్యారు. మరికొన్ని కుటుంబాల్లో తల్లి లేదా తండ్రి చనిపోయారు. జిల్లాలో తల్లి, తండ్రి ఇద్దరినీ కోల్పోయిన పిల్లలు 17 మంది ఉండగా, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పిల్లలు 198 మంది ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పిల్లల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయి.

అప్పుల పాలు..

కరోనా బారిన పడి ఆస్పత్రుల్లో చేరిన వారి వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చింది. కొందరికి రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల దాకా ఖర్చయ్యాయి. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు కరోనా బారిన పడగా వైద్యానికి రూ. 16 లక్షల వరకు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అతడి కుటుంబం దిక్కులేనిదయ్యింది. ఇదే సమయంలో వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చేందుకు ఆ కుటుంబం ఆస్తులు అమ్మాల్సి వచ్చింది. చాలామంది కరోనా వైద్యానికి చేసిన అప్పుల నుంచి తేరుకోలేకపోయారు.



లాక్‌డౌన్ సమయంలో ఖాళీగా ఉన్న కామారెడ్డి బస్టాండ్ (ఫైల్)

కామారెడ్డిలో పోటాపోటీ సమీక్షలు

- నిన్న ఎమ్మెల్యే.. నేడు ప్రభుత్వ సలహాదారు
- తాగునీటి సమస్య, అభివృద్ధి పనులపై రివ్యూలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : విభిన్న రాజకీయాలకు వేదికైన కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా నడుస్తోంది. నువ్వా నేనా అన్నట్టుగా ఆధిపత్యం కోసం ఇరువురు నేతలు పోటీ పడుతున్నారు. ఇక్కడ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కేంద్రాలుగా రాజకీయాలు నడుస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ కామారెడ్డిలో నెలకొన్న పోటీని ఆసక్తిగా గమనించారు. అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలు పోటీ చేయడం, వాళ్లిద్దరిని బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ఓడించడం అప్పట్లో సంచలనంగా మారింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సహజంగా అధికార పార్టీ నేతలు అన్నింటా అజమాయిషీ చేస్తుంటారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. నాలుగు దశాబ్దాలుగా నియోజక వర్గంలో రాజకీయాలు నెరపుతున్న షబ్బీర్ అలీ.. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉండడంతో తన మాట చెల్లుబాటయ్యేలా దూకుడు పెంచారు. అధికారుల పోస్టింగ్‌ల నుంచి నిధుల మంజూరు వరకు ప్రతి విషయంలోనూ తన మార్కు ఉండేలా ప్రయత్నిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దీన్ని సీరియస్‌గా తీసుకుని అసెంబ్లీ వేదికగా పలుమార్లు నిరసన తెలిపారు. తన హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తాను ప్రతిపాదించిన పనులను మంజూరు చేయడం లేదంటూ నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరువురు నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు జరిగాయి. వీరి మధ్య ఆధిపత్యపోరుతో అధికారులు కొన్నిసార్లు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తాజాగా గురువారం నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో పాటు వివిధ అంశాలపై ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో రివ్యూ నిర్వహించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మరుసటి రోజే అంటే శుక్రవారం షబ్బీర్ అలీ కూడా కలెక్టరేట్‌లో అధికారులతో రివ్యూ చేసి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. వివిధ అభివృద్ధి పనుల విషయంలోనూ ఆయన సమీక్షించారు. ఒకరోజు ఎమ్మెల్యే, మరుసటి రోజు ప్రభుత్వ సలహాదారు నిర్వహించిన సమావేశాలకు అధికారులు హాజరయ్యారు. ఇద్దరు చెప్పింది విని నోట్ చేసుకుని తలూపారు. ఏ నియోజకవర్గంలోనూ లేని విచిత్ర పరిస్థితి కామారెడ్డిలో ఉండడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం



జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్



జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి టౌన్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది. సమయానికి ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. జిల్లావ్యాప్తంగా 64 కేంద్రాల్లో 12,579 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 12,552 మంది పరీక్ష రాశారు. 27 మంది గైర్హాజరయ్యారు. డీఈవో రాజు పరీక్షలను పర్యవేక్షించారు. పట్టణంలోని గౌతమ్ మోడల్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట కామారెడ్డి తహసీల్దార్ జనార్దన్ ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ రాజేశ్ చంద్ర శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టాలన్నారు. ఏఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ సీఐ తిరుపయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బడే మియా.. చోటే మియా!



సత్యనారాయణగౌడ్, జశ్వంత్

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెదకు చెందిన సత్యనారాయణ గౌడ్, జశ్వంత్ స్నేహితులు. పదో తరగతి చదువుతున్న వారిద్దరూ శుక్రవారం వార్షిక పరీక్షలు రాయడానికి గోపాల్‌పేట మోడల్ స్కూల్‌కు వచ్చారు. ఒకరేమో అమితాబ్ బచ్చన్‌లా పొడుగ్గా ఉండగా.. మరొకరు గోవిందాలా పొట్టిగా ఉన్నారు. ఆ స్నేహితులిద్దరిని చూసిన పలువురు బాలీవుడ్ నటులు అమితాబ్, గోవిందాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

కలెక్టరేట్ ముట్టడి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా బాన్సువాడ కాంగ్రెస్ నాయకుల ఆందోళన
- గుండెపోటుతో మరణించిన కాంట్రాక్టర్ శవంతో నిరసన

నిజామాబాద్ అర్బన్: బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. గుండె పోటుతో మృతి చెందిన కాంట్రాక్టర్ మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తీరుపై నిరసన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.

బాన్సువాడ నియోజకవర్గానికి ఇటీవల ఈజీఎస్ పనులు మంజూరయ్యాయి. వీటిని స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ఇస్తున్నారని మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి ఇవ్వడం లేదని పలువురు కాంగ్రెస్ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గంలోని 9 మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సుమారు 400 మంది వివిధ వాహనాలలో నిజామాబాద్ కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. కలెక్టరేట్ ప్రవేశం మార్గం వద్ద బైఠాయించారు. జిల్లా కలెక్టర్ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. ఎంపీడీవోలు నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పిన వారికే పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా కలెక్టర్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ప్రవేశ మార్గం వద్దకు వచ్చి కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారమే పనులు కేటాయించాలని ఆందోళనకారులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అదే సమయంలో బీర్కూరు మండలం దామరంచకు చెందిన కాంట్రాక్టర్ ఇక్బాల్ గుండెపోటుతో ఆయన స్వగ్రామంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టర్ శవాన్ని కలెక్టరేట్‌కు తరలించి ఆందోళన చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆందోళనకారులను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి పెట్టిన ఇబ్బందుల వల్లనే కాంట్రాక్టర్ ఇక్బాల్ గుండెపోటుతో మరణించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. గతంలో ఇక్బాల్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారని, వేధింపులకు గురిచేస్తున్నాడని సామాజిక మాధ్యమంలో పోస్టులు కూడా పెట్టిన ట్లు ఆందోళన కారులు పేర్కొన్నారు. మృత దేహంతో అరగంట పాటు నిరసన వ్యక్తం చేసి వెళ్లిపోయారు. ఆందోళనలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాసరావు, బాన్సువాడ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పాత బాలకృష్ణ, గణేశ్ నందు పటేల్, కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.



నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు

అకాల వర్షం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో పలు ప్రాంతాలలో పంటలు దెబ్బతిన్నాయి.

రాజంపేట మండలం అర్గొండలో 21 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మాచాపూర్‌లో 9 మిల్లీ మీటర్లు, దోమకొండలో 8.9 మిల్లీ మీటర్లు, సదాశివనగర్‌లో 6.3 మిల్లీ మీటర్లు, లింగంపేటలో 6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. లింగంపేట మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో పిడుగుపాటుకు రెండు గేదెలు, అదే మండలంలోని పోతాయిపల్లిలో మూడు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. తిమ్మారెడ్డిలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ స్తంభం విరిగిపడింది. పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. మక్క, జొన్న పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. దోమకొండ శివారులో ఓ రేకుల షెడ్డు గాలికి కొట్టుకుపోయింది.



పోతాయిపల్లిలో పిడుగు పాటుకు మృతి చెందిన గొర్రెలు



తిమ్మారెడ్డిలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడ్డ స్తంభం



రాంలక్ష్మణ్‌పల్లిలో నేలకొరిగిన మక్క



దోమకొండలో వర్షానికి ఎగిరిపడిన రేకుల షెడ్డు



అంతంపల్లిలో వర్షానికి నేలకొరిగిన మక్క పంట

క్లుప్తంగా

మహిళల చైతన్యంతోనే మానవ అక్రమ రవాణా నిర్మూలన



కామారెడ్డి రూరల్: మానవ అక్రమ రవాణాపై గ్రామ సంఘం అధ్యక్షురాళ్లకు, వీవోఏలకు విశ్రాంత ఉద్యోగుల సంఘంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీవీటీ రాజేందర్ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం గ్రామాల్లో మహిళలు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మహిళా చట్టాలు, లైంగిక, శ్రమ, అవయావాలు, దోపిడి తదితర అంశాలపై అవగాహన కల్పించి గ్రామీణ మహిళలను చైతన్యవంతులు చేయాలని సూచించారు. ఈ శిక్షణ అనంతరం గ్రామాల్లోని చిన్న సంఘాల సమావేశాలలో సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మానవ అభివృద్ధి విభాగం రమేష్‌బాబు, ఏపీఎం మోయిజ్, గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలు, సీసీలు, విశ్వనాథ్, అంజాగౌడ్, స్వరూపరాణి, సంజీవులు, మండల సమాఖ్య సిబ్బంది లావణ్య, లత, సవిత, టీవోటీలు రాజేందర్, జగదీష్ కుమార్, శ్రీనివాస్, అన్నపూర్ణ, గీత, మహిళ సాధికారిత కేంద్ర ప్రతినిధులు శిరీష, శారద, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెదవాఖానాను పరిశీలించిన ఏఎస్పీ



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న పల్లె దవాఖానా వద్ద రెండు రోజుల క్రితం దినసరి కూలీ రాము మృతి చెందాడు. ఈ విషయమై ఏఎస్పీ చైతన్యారెడ్డి బస్వాపూర్ గ్రామానికి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు జరుగుతున్నపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది



కామారెడ్డి రూరల్: మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం 11 మండలాలకు చెందిన వారిలో మండలానికి ఆరుగురి చొప్పున శిక్షణను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పాఠశాల ఏకరూప దుస్తుల తయారీ బాధ్యత ప్రభుత్వంమహిళలకు అప్పగించిందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టు మిషన్లను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించిందని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించి ముందు యూనిఫామ్ కుట్టడం నేర్పించినట్లు తెలిపారు. బల్క్ కటింగ్, ఖాజాలు, బటన్‌లు, కొలతలు ఏవిధంగా తీసుకోవాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో డీపీఎం కె రమేష్ బాబు, ఏపీఎంలు రాజేందర్, మోయిజ్, టీవోటీలు, ఆజేశ్వరీ, సల్మా, 11 మండలాలకు చెందిన మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సలహాలు, సూచనలు ఇవ్వండి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఓటరు జాబితా విషయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సలహాలు, సూచనలు అందజేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా, ఎన్‌రోల్‌మెంట్, మార్పులు, చేర్పులు, ఓటర్ల తొలగింపులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజక ర్గాల పరిధిలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం 58,501 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి వివిధ కారణాలతో 6,310 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. 51,969 దరఖాస్తులను ఆమోదించామని, 222 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. బూత్ స్థాయి ఏజెంట్‌లను నియమించుకోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఆయా బూత్‌ల పరిధిలో జరిగే విషయాలను బూత్ స్థాయి ఏజెంట్లకు తెలియజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళ, డీటీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టి సారించాలి

కామారెడ్డి క్రైం: ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి ఫీజులను వసూలు చేయడం, ప్లాట్ల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించిన వారందరికీ వెంటనే మంజూరు పత్రాలను అందించాలన్నారు. ఈనెల 31 వరకు 25 శాతం రాయితీపై క్రమబద్ధీకరణ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

- ఎస్పీ రాజేశ్‌చంద్ర
- గ్రామాల్లో గస్తీ దళాలు ఏర్పాటు చేయాలని సూచన

దోమకొండ/బీబీపేట: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. శుక్రవారం దోమకొండ, బీబీపేట పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలని, పెండింగ్ కేసులు ఉంటే వారి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. దొంగతనాలు జరుగుతున్నందున గ్రామాల్లో గస్తీ దళాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ కచ్చితంగా నిర్వహించాలన్నారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు. దోమకొండ, బీబీపేటలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సైలు స్రవంతి, ప్రభాకర్, ఏఎస్ఐ జానీపాషా, సిబ్బంది ఉన్నారు.



దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

- ముందస్తు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి క్రైం: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలతో నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి కామారెడ్డి నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉత్పన్నం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా చేపడుతున్న పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఏరియాలో రోజుకు రెండు సార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పట్టణంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించాలన్నారు.సమావేశంలో భాగంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, తాగునీటి అవసరాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, జీపీల నిధులను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళాచట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- అడిషనల్ డీఆర్‌డీవో మురళీకృష్ణ



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో మురళీకృష్ణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళాచట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో మురళీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మానవ అక్రమరవాణా నిరోధకతపై గ్రామసంఘం అధ్యక్షులతోపాటు వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమరవాణాను నిరోధించడానికి, మహిళలను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు మహిళాసంఘాల సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంత, ఏపీయం జగదీశ్, అకౌంటెంట్ రాజు తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మానవ అక్రమ రవాణ నేరం అని అడిషనల్ డీఆర్‌డీవో మురళీకృష్ణ వెల్లడించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఆయా గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచన, సీసీలు మేహర్, గంగరాజు, రాజిరెడ్డి, నజీర్, శ్రావణ్, స్వప్న, అంజయ్య, మన్సూర్‌ఖాన్, ఆయా గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకోవడానికి పరిష్కార వేదిక



సమస్యలు తెలుసుకుంటున్న నారాయణ

బిచ్కుంద(జుక్కల్) : విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకోవడానికి ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ (సీజీఆర్ఎఫ్) ఎరుకల నారాయణ అన్నారు. శుక్రవారం బిచ్కుంద సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. వినియోగదారుల ఇళ్లకు వెళ్లి రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సభ్యులు సలంద్ర రామకృష్ణ, రాజాగౌడ్, కిషన్, డీఈ గంగాధర్, ఏడీఏ సంజీవ్ కుమార్, ఏఈ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యారంగంలో సమూల మార్పులు

- సర్టిఫికెట్స్ వస్తున్నాయి.. ఉద్యోగాలు రావడం లేదు..
- ప్రణాళిక ప్రకారం సిలబస్ మార్పునకు శ్రీకారం
- ప్రతి కోర్సుకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఉన్నత చదువులు పూర్తి చేసిన విద్యార్థుల చేతికి సర్టిఫికెట్లు వస్తున్నాయి.. కానీ ఉద్యోగాలు రావడం లేదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న సమస్యలకే పిరికితనంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన కీలకవక్తగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న తన సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి తనకు చెప్పకుండానే ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారని తెలిపారు. తెలంగాణ విద్యారంగాన్ని ఉన్నత స్థాయికి చేర్చాలని, నైపుణ్యం కలిగిన యువతను తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం ముందుకు సాగుతున్నారని అన్నారు. విద్యను అర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఒక ప్రణాళిక ప్రకారం సిలబస్ మార్పునకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రతి కోర్సుకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కోర్సు లో చేరే విద్యార్థులు చదువుతో పాటు ఇంటర్న్‌షిప్ లో పాల్గొనడం వల్ల ఉపాధి, ఉద్యోగావకాశాలు సాధించగలుగుతారని తెలిపారు. అలాగే సివిల్ సర్వీస్ లో తెలంగాణ యువతకు తక్కువ అవకాశాలు వస్తున్నాయని, ఉత్తరాది రాష్ట్రాల వారే సివిల్ సర్వెంట్లుగా మనపై పెత్తనం చెలాయిస్తున్నారని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఉండటం ఒక కారణమని గుర్తించి, దీనిపై కేంద్రంతో పోరాడి ప్రాంతీయ భాషల్లో సైతం ఇంటర్వ్యూలు చేపట్టేలా చేశామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ హానర్స్ సబ్జెక్టు ను తెలుగులో ప్రవేశపెట్టామని, ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు సివిల్ పరీక్షల్లో మెరుగ్గా రాణించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే మ్యాథ్స్ సబ్జెక్టులో పోటీ పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నలను విద్యార్థులకు నేర్పిస్తారని తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో సమయాన్ని వృథా చేయవద్దని, చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. మారుమూల గ్రామం నుంచి వచ్చిన తాను విద్య వల్లనే నేడు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ స్థాయికి చేరుకున్నట్లు పురుషోత్తం తెలిపారు. ఇప్పటికీ తమ గ్రామస్తులు ఆర్టీసీ బస్సును చూడలేదన్నారు. పురుషోత్తం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం గండమల్ల గ్రామానికి చెందిన వారు.

దేశాన్ని నడిపించేది అర్థశాస్త్రమే

దేశాన్ని నడిపించేది అర్థశాస్త్రమేనని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగాధిపతి పున్నయ్య అధ్యక్షతన శుక్రవారం క్యాంపస్ కా మర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'రాష్ట్ర బడ్జెట్‌పై విశ్లేషణ' అనే అంశంపై సెమినార్ ని ర్వహించారు. ఈసందర్భంగా వీసీ యాదగిరిరావు, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం, రిజి స్ట్రార్ యాదగిరి మాట్లాడారు. అనంతరం పురుషోత్తంను వీసీ, రిజిస్ట్రార్‌లు సత్కరించారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, సెమినార్ కన్వీనర్ పున్నయ్య, కోకన్వీనర్ సంపత్, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, పా త నాగరాజు, స్వప్న, శ్రీనివాస్, దత్తహరి ఉన్నారు.

తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

- 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి
- డీపీవో మురళి



తాడ్వాయిలో మాట్లాడుతున్న డీపీవో మురళి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని డీపీవో మురళి అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యదర్శుల ప్రత్యేక సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. గ్రామాలలో అధికారులు పర్యటించి తాగునీటి సమస్యలను పరిష్కారించాలన్నారు. అలాగే ప్రతిగ్రామంలో 100శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): తాగునీటి కొరతను అధిగమించడానికి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎంపీవో మల్హారి సూచించారు. శుక్రవారం వాటర్ డే సందర్భంగా మండల కేంద్రంలోని వీధుల్లో కుళాయిల వద్ద గుంతలను పరిశీలించారు. కుళాయిలకు మోటార్లు ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తామన్నారు. గ్రామ శివారులోని నర్సరీ, కంపోస్టు షెడ్డు, పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తాం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో నీటి చౌర్యానికి పాల్పడితే పోలీసు కేసులు నమోదు చేయిస్తామని మండల మిషన్ భగీరథ ఏఈ విష్ణు, ఎంపీవో మల్హారి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని సురాయిపల్లి ఎర్రోళ్ల తండా, జగదాంబ తండా, కొట్టాల్ గడ్డ తండాలకు చెందిన పలువురు రైతులు మిషన్ భగీరథ పైపులైన్ గ్రిడ్‌కు అమర్చిన ఎయిర్ వాల్స్ నుంచి నీటి చౌర్యానికి పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు.

కల్యాణ తలంబ్రాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ : భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాల వాల్‌పోస్టర్లను శుక్రవారం బాన్సువాడ ఆర్టీసీ డిపోలో డీఎం సరితాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామ నవమి పురస్కరించుకొని స్వామివారి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో హోం డెలివరీ చేస్తోందన్నారు. ఆర్టీసీ డిపో పరిధిలోని భక్తులు రూ.151 చెల్లిస్తే భద్రాది శ్రీ సీతారామచంద్ర స్వామి గోటి తలంబ్రాలతో పాటు రెండు ముత్యాల కల్యాణ తలంబ్రాలు ఇంటికి పంపిస్తామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9154298729ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ బసంత్, ఆర్ఎంఈ కాశిరాం, డీఎంఈ ఇర్ఫాన్ ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి అర్బన్ : జిల్లాలోని ఉద్యోగుల వివిధ సమస్యలతో పాటు ప్రభుత్వం నుంచి సాధించాల్సిన పీఆర్‌సీ, పెండింగ్ డీఏ మంజూరు, సీపీఎస్ రద్దు, నగదు రహిత హెల్త్ స్కీం, పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. శుక్రవారం సాయంత్రం టీఎన్జీవోస్ జిల్లా భవన్‌లో కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వివిధ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అసోసియేట్ అధ్యక్షుడు చక్రదర్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి దేవరాజు, ప్రతినిధులు లక్ష్మణ్, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



బాన్సువాడ రూరల్: విద్యార్థులు, యువకులు మాదక ద్ర వ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ యాదగిరి అ న్నారు. శుక్రవారం మండలంలోని ఎస్ఎస్ఎల్ డిగ్రీకళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారుంటే రిహాబిలేషన్ సెంటర్లకు పంపించి ఉచిత వైద్యం అందిస్తామన్నారు. నెహ్రూయువకేంద్ర వలంటీర్ సునీల్‌రాథోడ్, ప్రిన్సిపల్ సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.

8.5 శాతానికి తగ్గిన ఎన్‌పీఏ

- డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి



సుభాష్‌నగర్: ఎన్‌డీసీసీబీని రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపేలా సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, సొసైటీ చైర్మన్లు కృషి చేయాలని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి అన్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 14 శాతం ఉన్న ఎన్‌పీఏ 8.5 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు వ్యా పార కార్యకలాపాలు రూ.1800 కోట్ల నుంచి రూ. 2100 కోట్లకు పెరిగిన సందర్భంగా చైర్మన్ కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చైర్మన్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో ఎన్‌పీఏ తగ్గింపునకు సిబ్బంది చేసిన కృషి అభినందనీయమన్నారు. ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, సీఈవో నాగభూషణం వందే, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. శుక్రవారం డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డితో కలిసి నాగారం గ్రామంలో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. నాయకులు వెంకట్రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నవీన్‌గౌడ్, సృజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఆటో–బైక్ ఢీ: పలువురికి తీవ్ర గాయాలు

రామారెడ్డి: రామారెడ్డి శివారులో శుక్రవారం రాత్రి ఆటో–బైకు ఢీకొనడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కామారెడ్డి వైపు నుంచి రామారెడ్డి వచ్చే క్రమంలో వాహనాలు ఢీకొన్నట్లు సమాచారం. ప్రమాదంలో ఆటోలోని ఇద్దరు వ్యక్తులకు, బైక్‌పై ఉన్న దినేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అర్గుల్ గ్రామస్తులపై కేసు నమోదు

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు. అర్గుల్ గ్రామ శివారులోని తన భూమిలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి డ్యామేజ్ చేసినట్లు పాలెం గ్రామానికి చెందిన ఏలేటి రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అర్గుల్ గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి, అల్కన్న, శేఖ్‌పాషా, రాంరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య ఆందోళన



కుటుంబ సభ్యులు, కులస్తులతో కలిసి భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిన బాధితురాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ భార్య ఆందోళన చేపట్టిన ఘటన లింగంపేట మండలం కోమట్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. కేశాయిపేట గ్రామానికి చెందిన నెల్లూరి భాగ్య, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన చీటూరి రాకేష్ ప్రేమించుకొని, పెద్దలను ఎదిరించి 2023లో పెళ్లి చేసుకున్నారు. కొన్ని నెలలు హైదరాబాద్‌లో కాపురం చేయగా భాగ్య గర్భం దాల్చింది. ఈక్రమంలో ఆమెకు కడుపు నొప్పి రావడంతో భర్త కొన్ని మందులు ఇచ్చాడు. గత నెల 21న నొప్పి తీవ్రం కావడంతో వైద్య పరీక్షలు చేయించగా గర్భంలోని శిశువు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అప్పటినుంచి భార్యను రాకేష్ మానసికంగా వేధింపులు గురిచేస్తుండేవాడు. ఈక్రమంలో ఆమెను హైదరాబాద్ నుంచి కేశాయిపేటలోని తన ఇంటికి తీసుకొచ్చి వదిలి పెట్టాడు. శుక్రవారం రాకేశ్ కోమట్‌పల్లికి వచ్చినట్లు తెలియడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె రాకేశ్ ఇంటికి వచ్చింది. దీంతో రాకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి పారిపోయాడు. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లనంటూ బాధితురాలు టెంట్ వేసుకొని ఆందోళనకు దిగింది. అధికారులు, గ్రామస్తులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతుంది.